RNI NO. APTELL/ 2006/18110

## ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. రాష్ట్రవ్యాప్తంగా 5వేల స్పెషల్ బస్సులు.. ఎప్పటివరకంటే?

రాఖీ పౌర్ణమి పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అదిరిపోయే శుభవార్త చెప్పింది. పండగ రద్దీ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5000 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

## హైదరాబాద్ వాసులకు బిగ్ అలర్ట్.. పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం..

హైదరాబాద్ నగర ప్రజలకు జలమండలి కీలక సూచనలు చేసింది. పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని.. ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించింది. జీహెచ్ఎంసీ చేపడుతున్న బండ్లగూడ ఎక్స్ రోడ్ వద్ద బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులకు అనుకూలంగా, హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్ట్ ఫేజ్--III, రింగ్ మెయిన్-I కి చెందిన 1500 ఎంఎం వ్యాసం గల ఎంఎస్ గ్రావిటీ మెయిన్‌పై జంక్షన్ పని చేపట్టనున్నారు.

నిజామాబాద్ సంపుటి : 20 సంచిక : 281 శుక్రవారం 28 ఆగష్టు 2026 పబ్లిషర్ : కొక్కు రవికుమార్ krk7018@gmail.com పేజీలు :4 రూ॥ 1/-

# హైదరాబాద్‌లో మరో టూరిజం స్పాట్



## -మీరాలం ట్యాంక్‌పై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు!

హైదరాబాద్:ఆగస్టు 27: హైదరాబాద్ మీరాలం ట్యాంక్‌ను ప్రముఖ పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా సాగుతున్న పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ సాగుతున్న పనులను ఒక్కొక్కటిగా పరిశీలించారు. అత్యుత్తమ డిజైన్లతో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. కొనసాగుతున్న పనులపై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన ద్వారాఅధికారులు వివరించారు. ప్రణాళికలను పూర్తిగా పరిశీలించిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. చెరువులోకి మురుగు నీరు చేరకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే చెరువు నుంచి మూసీలోకి వరద నీరు వెళ్లేలా నాలాను విస్తరించాలని చెప్పారు. పర్యాటకులు చెరువులో వాటర్ స్పోర్ట్స్ కోసం డిజైన్ చేయాలని, చెరువు మధ్యలో ఉన్న ఐలాండ్‌లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని చెప్పారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉన్నందున మీరాలం చెరువును, పరిసర ప్రాంతాలను పర్యాటకులకు ఆకట్టుకునేలా ఏర్పాట్లు జరగాలని సూచించారు. మీరాలం చెరువుపై నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జి పనులను పరిశీలించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువులోకి మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, మూసీలోకి వరద నీరు సజావుగా వెళ్లేలా నాలా విస్తరణ, వాటర్ స్పోర్ట్స్, ఐలాండ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆకస్మిక పర్యటన సందర్భంగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# నేపాల్ జల ప్రళయం..

## 288 మంది భారతీయులు మిస్సింగ్..

## 21 మంది సురక్షితమన్న కేంద్రం




నేపాల్ అకస్మిక వరదల్లో 200 మందికి పైగా భారతీయుల ఆచూకి మిస్ అయిన సంగతి తెలిసిందే. దీనిపై కేంద్ర మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. రసూవా జిల్లాలో మట్నత్తం 288 మంది భారతీయుల ఆచూకి తెలియరాలేదన్న ఆయన.. మరో 21 మందిని మాత్రం గుర్తించి సురక్షితంగా కాపాడినట్లు తెలిపారు. గల్లంతైన వారితో పాటు బాధితుల యోగ క్షేమాల కోసం నేపాల్ ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. ఫ్లాష్ ఫ్లడ్స్ కారణంగా రసువా ప్రాంతంలో కమ్యూనికేషన్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని రణధీర్ అన్నారు. ఫోన్ లైన్లు, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో క్షేత్రస్థాయిలో ఉన్న ప్రజలతో మాట్లాడటం సాధ్యపడటం లేదన్నారు. కాబట్టి నేపాల్ పర్యటనకు వెళ్లిన తమవారి ఫోన్లు కలవనంత మాత్రాన వారు ప్రమాదంలో ఉన్నట్లు కాదని స్పష్టం చేశారు.

## ధాన్యం నిల్వకు తెలంగాణ సర్కార్ భారీ ప్లాన్

హైదరాబాద్:ఆగస్టు 27: తెలంగాణలో పెరుగుతున్న వరి ఉత్పత్తి, ధాన్యం సేకరణకు అనుగుణంగా ఆధునిక నిల్వ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో ఆధునిక ధాన్య సైలోలను నిర్మించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పౌరసరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి ఈ అంశాలపై చర్చించారు. భవిష్యత్‌లో ధాన్యం నిల్వ అవసరాలను తీర్చేందుకు సంప్రదాయ గోదాములపై మాత్రమే ఆధారపడటం సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు. కొత్తగా నిర్మించే సైలోల ద్వారా అదనంగా 5 నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల శాస్త్రీయ నిల్వ సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

2లో

# మరో జలప్రళయం దూసుకొస్తోంది..

# నేపాల్‌ను హెచ్చరించిన చైనా.



నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని నింపాయి. అనేక గ్రామాలు తుడిచిపెట్టుకుపోగా.. వందలాది మంది జలసమాధి అయ్యారు. నేపాల్‌లోని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటన ప్రకారం.. ఈ ఆకస్మిక వరదల కారణంగా 826మంది ఆచూకీ గల్లంతయిందని పేర్కొంది. వీరిలో 579 మంది పర్యాటకులు ఉండగా.. వారిలో 300 మంది వరకు భారతీయులు ఉన్నట్లు పేర్కొంది. అయితే, ఈ పెనువిషాదంలో మృతుల సంఖ్య 175కు చేరింది. వీరి సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని అక్కడి అధికారులు పేర్కొన్నారు. నేపాల్ - చైనా సరిహద్దు ప్రాంతంలో సంభవించిన భారీ వరదలు, కొండచరియలు విరిగిపడటంతో ఇప్పటికే తీవ్ర నష్టం జరిగింది. ఈ క్రమంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో చైనా అధికారులు షాకింగ్ విషయం చెప్పారు. సహాయక చర్యలకు ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. విపత్తు ప్రాంతానికి ఈశాన్యంగా చోచెన్ ఖోలా, పురెపు సాంగ్పో నదుల సంగమం వద్ద ఉన్న బారియర్ లేక్ (అడ్డంకి సరస్సు) పొంగిపొర్లుతోందని వెల్లడించారు.

# శవాల గుట్టలు.. శరీర భాగాలు..

## పది అంతస్తుల ఎత్తులో బురద ప్రవాహం.. ఎలా ముంచేసిందంటే?



కేరళాలోని వయనాడ్‌లో 2024లో ఏం జరిగిందో తెలిసిందే. అంతా నిద్రపోతున్న వేళ.. అకస్మాత్తుగా విరుచుకుపడ్డ వరద.. ఒక ఊరు మొత్తాన్ని కబళించింది. అంతా గాఢ నిద్రలో ఉండటం వల్ల.. ఎవరూ తప్పించుకోలేని పరిస్థితి.

అధికారిక లెక్కల ప్రకారం.. 298 మంది చనిపోయారు. ఇంకా వందలాది మంది ఆచూకీ తెలియరాలేదు. వారు కూడా చనిపోయారనే భావిస్తున్నారు. ఇప్పుడు అలాంటిదే.. నేపాల్‌లో కూడా చోటుచేసుకుంది. అయితే, రాత్రి వేళ రాలేదు. పగటి వేళే వచ్చింది. సరిగ్గా 8.30 నుంచి 9 గంటల ప్రాంతంలో వరద ప్రవాహం రాకాసిలా విరుచుకుపడింది. పడగ విప్పిన పాములా అమాంతంగా.. గ్రామాలకు గ్రామాలను మింగేసింది. సుమారు 10 అంతస్తులకు పైగా ఎత్తైన బురద ప్రవాహం.. క్షణాల్లో పరివాహక ప్రాంతాలను ముంచేసి. తనతో తీసుకుపోయింది.

ఇళ్లు కూలిపో యాయ్. వంతెనలు తెగిపోయాయ్.. బండరాళ్లు కూడా దూది పింజా ల్లా కనిపించాయంటే.. ఆ వరద బలం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.



## బీజేపీలో బిగ్ రిఫార్మ్స్

## కిరణ్ కుమార్ రెడ్డికి గవర్నర్ పదవి?

సెప్టెంబర్‌లో కేంద్ర క్యాబినెట్ విస్తరణ
సీనియర్లను తప్పించి యువతకు అవకాశం
కిరణ్ రెడ్డికి గవర్నర్ గిఫ్ట్
ప్రధాని మోదీ సంచలన నిర్ణయం

2లో

# ఆయన అఘోర పూజలు నిజమే

## కానీ కాంగ్రెస్ కోసం కాదు..



## తాంత్రిక పూజల గుట్టు రట్టు చేసిన కవిత



క్షుద్ర పూజలు హరీశ్‌ను వదలడం లేదు.. హరీశ్‌ను కవిత వదలడం లేదు. నిను వీడని నీడను నేనే.. అన్నట్టుగా పూజల వెనుక హరీశ్.. హరీశ్‌ను వెంటాడే పనిలో కాంగ్రెస్.. ఇప్పుడు కవిత ఎంట్రీతో సీన్ మొత్తం మారిపోయింది.

2లో

ప్రతి అక్షరం... ప్రజల పక్షం...
ప్రజాగళం
తెలుగు దినపత్రిక



## సంపాదకీయం

# కరువు నిబంధనలను 'జటిలం' చేసిన కేంద్ర ప్రభుత్వం

దీర్ఘకాలం పాటు వర్షం లేకపోవడం, పంటలు పండక పోవడం, ప్రజలకు, పశువులకు ఆహార కొరత, మంచినీటి కొరత ఏర్పడటాన్ని కరువుగా పేర్కొంటారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజులలో పెద్దలు డొక్కల కరువు గురించి చెప్పుకునేవారు. బ్రిటిష్ పాలకులు ప్రజలను పట్టించుకోకపోవడంతో ప్రజలు మట్టి జావ కాసుకొని తాగినట్లు చెప్పుకునేవారు. స్వాతంత్ర్యానంతరం 52 లో రాయలసీమ కరువు ఏర్పడింది. ఆనాటి భారత ప్రభుత్వం రాయలసీమ కరువును గుర్తించటానికి, సహాయ చర్యలు చేపట్టడానికి నిరాకరించింది. దానికై ప్రజలు పెద్ద ఎత్తున పోరాడి కరువు ప్రకటింప చేసుకున్నారు. 1966లో దేశ వ్యాపితంగా కరువు ఏర్పడింది. భారత ప్రభుత్వం కరువు నిబంధనలు రూపొందించింది. సాధారణ వర్షపాతం కన్నా 25 శాతం తక్కువ వర్షం కురవటం, పంటల సాగు విస్తీర్ణం 50 శాతం తగ్గటం, పంటల దిగుబడులు 33 శాతం తగ్గటం కరువు నిబంధనలుగా పేర్కొన్నారు. కరువు ప్రకటించాలంటే వర్షపాతంతో పాటు మరొక నిబంధన వర్తించాలని షరతు ప్రకటించారు. వర్షాన్ని బిలెక్కించటానికి విధానం రూపొందించారు. 24 గంటలలో రెండున్నర మిల్లీమీటర్ల వర్షపాతం పడితే ఒక వర్షపు రోజు కింద లెక్క. అటువంటి వర్షం 21 రోజులు పడకపోతే తేలికపాటి కరువుగాను, 29 రోజులు కురవకపోతే తక్కువ కరువుగాను, బి42 రోజులు దాటితే తీవ్ర కరువుగాను పరిగణించేవారు. కరువు ప్రకటించగానే ప్రభుత్వం తీసుకోవాల్సిన సహాయక చర్యల కింద ప్రజలకు ఉపాధి కల్పించడం, ప్రజలకు, పశువులకు తాగునీరు సరఫరా చేయటం, పశుగ్రాసం సరఫరా చేయటం, ఉచిత రేషన్ ఇవ్వటం, అంబలి కేంద్రాలు నిర్వహించడం, రైతుల రుణాలు రీ షెడ్యూల్ చేయటం, పేదలకు వినియోగ రుణాలు ఇవ్వడం తదితర కార్యక్రమాలు చేపట్టాలి. 2016లో దేశంలో తిరిగి కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్ర ప్రభుత్వం కరువు విధానాలను పునః పరిశీలించింది. "వేదాస్" పేరుతో బికొత్త నిబంధనలు ప్రకటించింది. "విజువలైజేషన్ ఆఫ్ ఎర్త్ అబ్జర్వేషన్ డేటా అండ్ ఆర్కైవల్ సిస్టమ్" అనే విధానాన్ని ప్రకటించింది. ఈ విధానంలో గతంలో ఉన్న మూడు నిబంధనలకు తోడు నీటి నిల్వలను కూడా పరిశీలించాలని చేర్చింది. వీటిలో కనీసం మూడు అంశాలు ఉంటేనే కరువుగా గుర్తించాలని పేర్కొన్నది. భూమిపైన, భూమి లోపల ఉన్న నీటి నిల్వలను భూమిలో ఉన్న తేమ శాతాన్ని పరిగణలోకి తీసుకోవాలని పేర్కొన్నది. బివ్యవసాయం రాష్ట్ర ప్రభుత్వ అజమాయిషి లోనిది. కావున రాష్ట్ర ప్రభుత్వాలు కరువు ప్రాంతాలను నిర్ణయించి పంపితే, కేంద్రం పరిశీలించి ఆమోదం తెలుపుతుందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వాలు నివేదికలు పంపిన అనంతరం కేంద్ర బృందాలు పర్యటించి, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి నిర్ధారించిన తరువాత కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తుంది. ప్రకృతి వైపరీత్యాల నిధి నుండి కొంత సహాయం చేస్తుంది. కేంద్ర దళాలు పర్యటనకు రెండు నుండి నాలుగు మాసాల సమయం పట్టేది. అప్పటికే ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమయ్యేది. ఇది ఒక తంతుగా మారింది. కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ప్రవేశ పెట్టింది. దిగుబడి ఆధారిత పంటల బీమా, పర్యావరణ ఆధారిత పంటల బీమా పథకాలను కలిపి ఒకే చట్టం చేసింది. బీమా పథకం అమలుకు పది ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. 2019లో ప్రైవేటు బీమా కంపెనీలు వ్యవసాయ శాఖ ఉద్యోగులు రూపొందించిన కరువు అంచనాలను అంగీకరించేది లేదని, శాటిలైట్ సమాచారం ద్వారా సేకరించే విధానం ప్రవేశపెట్టాలని పేచీపెట్టాయి. కేంద్ర ప్రభుత్వం అందుకు అంగీకరించింది. ఈ కాలంలో ప్రైవేటు బీమా కంపెనీలు, రూ.24 వేల కోట్ల లాభాలు పోగేసుకున్నాయి. రైతులకు చెల్లించింది స్వల్పం. బి ప్రస్తుతం ఇండియన్ స్పేస్ రీఛార్జ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) వారు రూపొందించిన స్పేస్ అప్లికేషన్ సెంటర్ ద్వారా సమాచారం సేకరించే విధానం చేపట్టింది. స్వల్ప వర్షపాతం కలిగిన రాయలసీమలో విత్తనాలు మొలకెత్తని భూమి ఎంత శాతం. మొలకెత్తినా గిడసవారి నేలకు అంటుకుపోయిన విస్తీర్ణం ఎంత శాతం? మొలకెత్తి ఎండిపోయిన పంట ఎంత శాతం? అనేది ఎలా నిర్ధారిస్తారో అంతు పట్టదు. రాయలసీమలో భూగర్భ జలాలు అడుగంటుతున్న వార్తలు వస్తున్నాయి. శాటిలైట్ సమాచారంలో వృక్ష సమాచారం ప్రకారం పంటలు వేయక పోయినా అటవీ వృక్షాలు, హార్టికల్చర్ పంటలు పచ్చని వాతావరణం చూపిస్తాయి. ఇప్పుడు వర్షాభావానికి గురైన పండ్ల తోటలు జబ్బుపడి ఏడాది పొడవునా పూత పూయటం, పూత నిలపటం, పిందె కట్టడం, కాపు నిలపటం అన్ని దశలలోనూ బలహీనంగా ఉంటాయి. ఇవన్నీ శాటిలైట్ ద్వారా తెలియవు. ప్రత్యక్షంగా తీసుకోవాల్సిన వివరాలు. కేంద్ర ప్రభుత్వం 2025లో ప్రకృతి వైపరీత్యాల చట్టానికి సవరణలు చేసింది. గత చట్టంలోని 12, 13, 61 క్లాజులను తొలగించింది. సెక్షన్ 12లో బాధితులను ఆదుకోవటానికి ఉన్న నిబంధనలు తొలగించారు. 13లో పంటలు కోల్పోయిన రైతాంగానికి రుణాలు రీషెడ్యూల్ చేసే చాప్టర్ ను తొలగించారు. 61వ క్లాజు ప్రకారం మహిళలకు, షెడ్యూల్ కులాలకు వివక్ష చూపకుండా పరిహారం ఇవ్వాలనే నిబంధన తొలగించారు. ఈ చట్టం అమలు లోకి వస్తే బిపంట నష్టపరిహారాలు, రుణాల రీ షెడ్యూలు హుళక్కే. పంటల బీమా మాత్రమే దిక్కు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి బీమా ప్రీమియం చెల్లించమని పదేపదే చెప్తోంది. గత ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం ప్రవేశపెట్టి రెండు సంవత్సరాలు అమలు చేసింది. ఈ ప్రభుత్వం ఉచిత బీమా పథకాన్ని రద్దు చేసింది. గత రెండు సంవత్సరాల నుండి బీమా చెల్లించిన వారికి బీమా ఇచ్చిన దాఖలాలు లేవు. ఫలితంగా రైతులు ఆసక్తి చూపటంలేదు. చెల్లించాలని ప్రభుత్వ పెద్దలు పదే పదే చెప్తున్నారు. ఈ ఏడాది కేరళకు రుతుపవనాలు ఆలస్యంగా వచ్చాయి. అప్పటికీ ముందు నుండే "ఎల్‌నినో" ప్రభావం గురించి శాస్త్రవేత్తలు చెబుతూనే ఉన్నారు. అయినా మన రాష్ట్ర ముఖ్యమంత్రి కృష్ణా, గోదావరి డెల్టాలకు ముందుగా నీరు వదులుతామని, ఒక నెల ముందుగానే నాట్లు వేస్తే నవంబర్, డిసెంబర్ మాసాలలో వచ్చే తుఫానులకు ముందే వరి కోతలు పూర్తి చేసుకోవచ్చని, ముందుగా నారుమళ్ళు పోసుకోమని రైతులకు పిలుపు ఇచ్చారు. రైతాంగం నారుమళ్ళు పోయటం, భూమిని సిద్ధం చేయటం, గట్లు వేయటం, వగైరా పనులు పూర్తి చేశారు. బోర్లు ఉన్న రైతులు నాట్లు వేశారు. కొందరు రైతులు భూమిని దున్ని ఎద పెట్టారు. కొందరు గింజలు చల్లి పొడి కప్పు కప్పారు. జులై చివరి నాటికి కృష్ణా డెల్టాలో వరి నాట్లు వేయవద్దని, ప్రత్యామ్నాయ పంటలు వేసుకోమని ముఖ్యమంత్రి ప్రకటించారు. రైతాంగాన్ని గందరగోళం లోకి నెట్టారు. అంతర్జాతీయ నీటి యాజమాన్యం ఇన్‌స్టిట్యూట్ వారు చెప్పిన వివరాల ప్రకారం భారత ప్రభుత్వం నెలకొల్పిన "సుఖ రక్షక్ "అడ్వైజర్ సిస్టమ్ ఈ ఏడాది వర్షపాతం అతి తక్కువగా ఉంటుందని మే 22వ తేదీనే సమాచారం ఇచ్చిందని పేర్కొంది."సుఖ రక్షక్ " దేశంలోని 22 భారతీయ భాషలలో ఈ విషయం ప్రకటించినట్లు అంతర్జాతీయ నీటి యాజమాన్య ఇన్‌స్టిట్యూట్ వారు పేర్కొన్నారు. అయినా మన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల వైపు సిద్ధం చేయకపోవటం దురదృష్టం. ఇందుకు రాష్ట్ర ప్రజానీకం మూల్యం చెల్లించాల్సి వస్తున్నది.

## మరో జలప్రళయం దూసుకొస్తోంది..

# నేపాల్‌ను హెచ్చరించిన చైనా.

మచ్చే 72గంటల్లో దీంతో దిగువ ప్రాంతాల్లో మరిన్ని వరదలు సంభవించే అవకాశం ఉందని చైనా జలవనరుల మంత్రిత్వ శాఖ హెచ్చరికలు చేసింది. నేపాల్‌లోని చోచెన్ ఖోలా, పురేపు త్సాంగ్పో నదుల సంగమం సమీపంలో ఉన్న బారియర్ లేక్ ఏర్పడింది. కొండచరియలు విరిగిపడటంతో నదీ ప్రవాహానికి అడ్డుగా మట్టి, రాళ్లు పేరుకుపోయి ఈ సరస్సు ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. చైనా అధికారులు గుర్తించిన బారియర్ లేక్‌లో ప్రస్తుతం సుమారు 20 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ సరస్సు నుంచి నీరు పొంగిపొర్లుతుండగా.. రాబోయే మూడు రోజుల్లో మరో 30 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు అందులోకి చేరే అవకాశం ఉందని చైనా సెంట్రల్ టెలివిజన్ పేర్కొంది. దీంతో దిగువ ప్రాంతాల్లో మరిన్ని వరదలు సంభవించే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ కొత్త ప్రమాదం నేపథ్యంలో చైనా జల వనరుల మంత్రిత్వ శాఖ సరస్సు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నీటి మట్టం, ప్రవాహంపై అంచనాలు వేస్తోంది. ఇప్పటికే ప్రమాద ప్రాంతాల్లోని టిబెట్ వైపు గ్రామాలను ఖాళీ చేయించారు. మరోవైపు.. నేపాల్ లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భారీ వరదల్లో మృతుల సంఖ్య పెరుగుతుండగా.. వందలాది మంది గల్లంతైనట్లు అధికారులు చెబుతున్నారు. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. నేపాల్ సైన్యం రక్షణ చర్యల్లో పాల్గొంటూ హెలికాప్టర్ల ద్వారా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. బారియల్ లేక్ పరిస్థితి తీవ్రత దృష్ట్యా చైనా బీజింగ్, చెంగ్డూ ప్రాంతాల నుంచి ఫైర్ అండ్ రెస్క్యూ బృందాలను రంగంలోకి దింపింది. చైనా, నేపాల్ అధికారులు సమ న్వయంతో పనిచేస్తున్నారు. ఎగువ ప్రాంతంలోని బారియర్ లేక్ నుంచి మరింత వరద వస్తే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సహాయక చర్యలను మరింత ముమ్మరం చేశారు.

# నేపాల్ జల ప్రళయం 288 మంది భారతీయులు మిస్సింగ్. 21 మంది సురక్షితమన్న కేంద్రం

ఇదిలా ఉంటే అందుబాటులోకి రాని 288 మంది భారతీయులలో త్రిశూలి-1 విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 73 మంది కార్మికులు ఉన్నారు. కాట్మండ్ లోని భారత రాయబార కార్యాలయం ఈ ప్రాజెక్టు అధిపతులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. వీరితో పాటు కైలాస మానససరోవర్ యాత్రకు వెళ్లిన భక్తులు, నేపాల్ పర్యటనకు వెళ్లిన పర్యాటకులు కూడా మిస్ అయినవారిలో ఉన్నారు. తమిళనాడుకు చెందిన 'సామ్రాట్ ట్రావెల్స్', 'ఫ్లై ఎవరెస్ట్ ట్రావెల్స్' ద్వారా వెళ్లిన 37, 49 మందితో కూడిన రెండు బృందాల ఆచూకి మిస్ అయ్యింది. అలాగే బెంగాల్ నుంచి సామ్రాట్ ట్రావెల్స్ ద్వారా వెళ్లిన 32 మంది, రిచా టూర్స్ ద్వారా వివిధ రాష్ట్రాల నుంచి వెళ్లిన 61 మంది ఆచూకి తెలియరాలేదు. అలాగే కేరళకు చెందిన మరో 33 మంది పౌరులు మిస్ అయ్యారు మరోవైపు విషాదకర ఘటనపై భారత ప్రధాని నరేంద్ర మోదీ నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీతో టెలిఫోన్లో మాట్లాడారు. ఈ కష్టసమయంలో నేపాల్ ప్రజలకు భారత ప్రభుత్వం తరఫున సానుభూతి తెలిపారు. ప్రమాద తీవ్రతను ఎదుర్కొనేందుకు, సహాయక చర్యలు చేపట్టేందుకు భారతదేశం నుంచి కావలసిన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు.

# శవాల గుట్టలు.. శరీర భాగాలు...

ఎక్కడ చూసినా శవాలు, శరీర భాగాలే.. ఈ భారీ ప్రవాహం.. తప్పిచుకొనే ఛాన్స్ ఇవ్వలేదు. చాలామంది అది మన వరకు రాలేదులే అనుకున్నారు. కానీ, రెప్పపాటులో దిశ మార్చుకుని.. ఊర్లను సైతం తనలో కలిపేసుకుంది ఆ రాకాసి వరద. విపత్తు తర్వాత చూస్తే.. బురదలో కూరుకుపోయిన శవాల గుట్టలు కనిపించాయి.

కొన్ని చోట్ల తెగిపడిన కాళ్లు చేతులు.. అబ్బా, ఇక చెప్పలేం. చాలా దారుణమైన పరిస్థితి. ఇది చదువుతుంటేనే మన గుండెలు బరువెక్కుతున్నాయంటే.. ఆ ప్రళయాన్ని ప్రత్యక్షంగా చూసిన, అనుభవించిన ప్రజల పరిస్థితి మరెలా ఉంటుందో ఊహించుకోండి. ఇప్పటివరకు లభ్యమైన శవాలు సుమారు 270. ఇంకా వేలాది మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. వారు బతికే ఉన్నారా? లేదా బురదలోనే సజీవ సమాధి అయ్యారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రళయ విధ్వంసం.. ఇలా మొదలైంది

మొదట్లో దీన్ని భూకంపంగా భావించారు. చైనాలో ఒక డ్యామ్ బద్దలైందని అనుకున్నారు. కానీ, హిమాలయాల్లో ఏర్పడిన హిమపాతం వల్ల.. ఒక భారీ గ్లేసియార్ విరిగిపడి త్రిశూలి, భోటే కోషి నదుల్లో 'ఉప్పెన' సృష్టించింది. ఫలితంగా గట్టు తెగినట్లుగా నీరంతా ఒక్కసారే అంత ఎత్తు నుంచి కిందికి ప్రవహించ సాగింది. సెకన్ల వ్యవధిలో అది పర్వాతాల్లో ఉన్న రాళ్లు, రప్పలు, బండరాళ్లను తొలిచేస్తూ.. పెద్ద బురద ప్రవాహంగా మారింది. డ్యామ్‌లను సైతం కూల్చేస్తూ.. అక్కడి నీటిని కూడా తనలో కలుపుకుంటు.. ఒకటి రెండింతలు ప్రమాదకరంగా మారింది. దాని మార్గంలో ఉన్న 19 వంతెనలు, 40 కిలోమీటర్ల రోడ్లు, 6 జలవిద్యుత్ కేంద్రాలను సైతం ప్రవాహం ధ్వంసం చేసింది. చైనా-నేపాల్ సరిహద్దుల మధ్య ఉన్న గైరోంగ్ పోర్ట్ బోర్డర్ క్రాసింగ్ పూర్తిగా ధ్వంసమైంది. వరద పోటేత్తె సమయంలో అక్కడ సరిహద్దు దాటేందుకు వెళ్లిన వందలాది టూరిస్టులు.. భయంతో పరుగులు పెడుతోన్న వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా చక్కర్లు కొడుతున్నాయి.

ఆ 288 మంది భారతీయులు ఏమయ్యారు?

విపత్తు సమయానికి నేపాల్‌లో ఉన్న 288 మంది భారతీయుల ఆచూకీ తెలియకపోవడంపై సర్వత్రా ఆందోళన నెలకొంది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాలు ప్రకారం.. సరిహద్దు ప్రాంతాల్లో చిక్కుకుపోయిన 288 మంది భారతీయుల గురించి తమకు ఎలాంటి సమాచారం అందలేదని పేర్కొన్నారు. వీరిలో చాలామంది కైలాస మానససరోవర్ యాత్రకు వెళ్లినవారు, స్థానికంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఇతర పర్యాటకులు ఉన్నారని తెలిపారు. బాధితుల వివరాల కోసం విదేశాంగ శాఖ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. నేపాల్ ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది.

# ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు కి రాఖీ కట్టిన చిన్నారులు...

హన్మకొండ న్యూస్ : వెలకట్టలేని మధుర బంధమే రక్షాబంధన్ అని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.గురువారం సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రక్షాబంధన్ సందర్భంగా కాజీపేటకు వండర్ ప్లే స్కూల్ చిన్నారులు ఎమ్మెల్యే కి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఎమ్మెల్యే స్వీట్స్ తినిపించి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.పండుగా ప్రతి కుటుంబంలో ఆనందం ఆప్యాయతలు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ వినీలా,మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం నిల్వకు తెలంగాణ సర్కార్ భారీ ప్లాన్

రానున్న రబీ సీజన్‌లో రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. దీనికి అనుగుణంగా ముందస్తు నిల్వ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. తక్షణ అవసరాల కోసం సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసే ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ వద్ద సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం మాత్రమే ఉందని అధికారులు మంత్రికి వివరించారు.కొత్తగా ఏర్పాటు చేయనున్న సైలోల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ కోసం ఆటోమేటెడ్ హ్యాండ్లింగ్ వ్యవస్థలు, యాంత్రిక రవాణా సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. నిల్వ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. దీంతో ధాన్యంలో తేమ, పురుగులు, ఇతర కారణాల వల్ల కలిగే నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

## మంత్రి కొండా సురేఖకు షాక్..

### - అధికారిక కార్యక్రమం ఫ్లెక్సీలో కనిపించని ఫోటో!

హైదరాబాద్:ఆగస్టు 27:తెలంగాణ కాంగ్రెస్‌లో గత కొన్ని రోజులుగా మంత్రి కొండా సురేఖ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకున్న ఓ తాజా పరిణామం రాజకీయ వర్గాల్లో మరింత ఉత్కంఠ రేపింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో మంత్రి కొండా సురేఖ ఫొటో కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిచ్చింది.మహబూబాబాద్ జిల్లా గూడూరులో ఎమ్మెల్యే మురళీనాయక్ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అధికారిక ఫ్లెక్సీలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సీతక్కతో పాటు ఇతర మంత్రుల ఫొటోలు ఉన్నప్పటికీ మంత్రి కొండా సురేఖ ఫోటో మాత్రం కనిపించలేదు. ఇటీవలి పరిణామాల నేపథ్యంలోనే ఉద్దేశపూర్వకంగా ఆమె ఫొటోను పక్కన పెట్టారా? లేక మంత్రివర్గం నుంచి ఆమెను తప్పించబోతున్నారనే ప్రచారానికి ఇది సంకేతమా? అనే చర్చ మొదలైంది.

## బీజేపీలో బిగ్ రిఫార్మ్స్

## కిరణ్ కుమార్ రెడ్డికి

# గవర్నర్ పదవి?

ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటన ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వంలోనూ, బిజెపి పార్టీ యంత్రాంగంలోనూ కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సెప్టెంబర్ మొదటి వారంలో కేంద్ర క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణతో పాటు పలు రాష్ట్రాల గవర్నర్ల బదిలీలు, కొత్త నియామకాలు చేపట్టేందుకు అధిష్ఠానం సన్నాహాలు చేస్తోంది. ప్రధాని మోదీ ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్ పర్యటనలు ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత ఈ ప్రక్రియ వేగవంతం కానుందని ఢిల్లీ వర్గాల్లో బలంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈసారి చేపట్టబోయే క్యాబినెట్ విస్తరణలో యువ నాయకులకు విస్తృతంగా అవకాశాలు కల్పించాలని ప్రధాని మోదీ యోచిస్తు న్నారు. 70 ఏళ్ల వయసు దాటిన 12 మందికి పైగా కేంద్ర, సహాయ మంత్రులను పదవుల నుంచి తప్పించి, వారికి పార్టీ బాధ్యతలు లేదా ఇతర కీలక పదవులు అప్పగించే యోచనలో ఉన్నారు. ప్రస్తుతం ప్రధానితో సహా 69 మంది మంత్రులు ఉండగా, రాజ్యాంగ నిబంధనల ప్రకారం మరో 12 మందికి మంత్రి వర్గంలో చోటు కల్పించే వీలుంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన నాయకులకు కూడా ఈ మార్పుల్లో ప్రాధాన్యత దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బిజెపి నేత నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి కి ఏదైనా రాష్ట్రానికి గవర్నర్‌గా బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అలాగే సిట్టింగ్ కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి బిజెపి అత్యున్నత నిర్ణయాత్మక విభాగమైన పార్లమెంటరీ బోర్డులో సభ్యత్వం ఇచ్చే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.సౌత్ ఏషియన్ కల్చరల్ ఈవెంట్లను కనుగొనడం

# ఆయన అఘోర పూజలు నిజమే

అసలు స్టోరీ ఇదీ అని మధ్యలో జోక్యం చేసుకున్నారు కవిత. ఈ క్షుద్ర పూజల అంశం తమకు దొరికిన అస్త్రమని సంబురపడ్డది కాంగ్రెస్. అందుకే రేవంత్ ఏ వేదిక ఎక్కినా.. పూజలు చేస్తున్నారు. మనం బాగుండొద్దట. వానలు పడొద్దట.. అని తమ పార్టీకి, ప్రభుత్వానికి దీన్ని ఓన్ చేసుకునే ప్రయత్నం చేశాడు. అంతే కాదు.. వీళ్ల మూతిపళ్లు రాలగొట్టండని పిలుపునివ్వడ0 మూలంగా ఎన్నికల్లో ఓడించ0డని కోరుతూ వస్తున్నాడు. కానీ ఈ అస్త్రం ఇప్పుడు చేజారి పోయింది చేతి పార్టీకి. కవిత అఘోర అసలు రూపానికి క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారివాళ. వాళ్లకేం తెలుసు పిచ్చోళ్లు.. రాష్ట్రం కోసం.. ప్రభుత్వం కోసం అని ఏవేవో ఊహించుకుంటున్నారు. ఆ ఫ్యామిలీ నుంచి వచ్చినదాన్ని నాకు అఘోర పూజల అసలు రహస్యం బాగా తెలుసు.. అని కుండబద్దలు కొట్టారు. గుట్టురట్టు చేశారు. కేసీఆర్ కోసమే ఆ పూజలు చేస్తున్నాడని కవిత క్లారిటీ ఇచ్చారు. కేసీఆర్ కోసమంటే.. ఆయన ఆయురారోగ్యాలతో, కలకాలం చల్లంగా ఉండాలని మీరనుకుంటే.. నిమ్మకాయల మీద కాలేసినట్టే. ఆయన ఆరోగ్యం త్వరగా చెడిపోవాలని, తొందరగా అనారోగ్యం పాలు కావాలని.. మొత్తానికి ఆయన నాశనం కోరుతూ ఈ పూజలు చేపించాడని ఖుల్లంఖుల్లాగా చెప్పేశారు కవిత. ఇప్పుడే అయిపోలే ఈ అఘోర ముచ్చట్లు. హరీశ్‌కు ఈ పూజలు చేపించే అలవాటు ఇప్పుడే కొత్త కాదట. ఎప్పట్నుంచో చేపిస్తున్నాడట. ఒకే లక్ష్యం.. అది కేసీఆర్ తొందరగా అనారోగ్యం పాలుకావాలనే. ఈ విషయం చాలా మందికి తెలుసునని కూడా అన్నారు కవిత. మీ డౌట్ క్లియర్ కావాలంటే.. ఏ పంతుల్ని అడిగినా టకీ మని చెప్పేస్తారట.. అవును.. అఘోర పూజలు నిజమే.. ఆయన చేసే పూజలు కేసీఆర్ కోసమేనని. ఇంకో ముచ్చట కూడా చెప్పారండోయ్.. కేసీఆర్‌ను అడుగుపట్టించేందుకు.. అన్ని విధాల నాశనం చేసేందుకు, రోగాల పాలు చేసేందుకు అఘోర పూజలు ఏమేమీ చేయాలో కూడా చాలా మందిని కలిసి చాలా ఎంక్వైరీలు చేశాడట హరీశ్ రావు. మొత్తానికి ఈ పూజలన్నింటిపైనా మంచి పట్టు సాధించి.. అవి ఎక్కడ చేయాలో సర్చింగ్ చేసి.. మొక్కవోని దీక్షతో, ఒకే ఒక్క లక్ష్యంతో అలుపెరగని యోధుడిలా పూజల మీద పూజలు.. చేపిస్తూనే ఉన్నాడట.. ఇవన్నీ నేను చెబుతున్న ముచ్చట కాదు బాబు.. ఆమే స్వయంగా చెప్పారు. క్లారిటీగా వివరించారు. శషభిషలు లేకుండా అందరి అనుమానాలు తీర్చారు. కాంగ్రెస్‌కు ఈ అఘోరా పూజల అంశం ఓన్ చేసుకోకుండా చేసేశారు. రేవంత్ పెట్టుకున్న అఘోర రావు అనే పేరు మాత్రం

ప్రతి అక్షరం... ప్రజల పక్షం...
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
28 -08-2026

# ఆత్మకు పరమాత్మతో ఉండే పవిత్ర బంధమే రక్షా బంధన్

- బ్రహ్మకుమారీ ఆధ్వర్యంలో ఘనంగా రక్షా బంధన్ వేడుకలు
- పీసీసీ అధ్యక్షుడికి రాఖీ కట్టిన సునీత బహేన్ జీ



నిజామాబాద్ సిటీ , ఆగష్టు 27 ( ప్రజాగళం ) రక్షా బంధన్ అనేది కేవలం సోదర సోదరీమణుల బంధం కాదని, ఆత్మకు పరమాత్మతో ఉండే పవిత్ర బంధమని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నాందేవ్ వాడ కేంద్రం నిర్వాహకురాలు సునీత బహెన్ జీ అన్నారు. గురువారం బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నాందేవ్ వాడ కేంద్రం ఆధ్వర్యంలో రక్షా బంధన్ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిజామాబాద్ లో పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు కే నగేష్ రెడ్డి, డీసీసీ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, నుడా చైర్మన్ కేశ వేణు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్ లకు సునీత బహేన్ జీ పవిత్ర దారాన్ని(రాఖీలు) కట్టి మిఠాయిలు అంధించి ఆశీర్వాదాలు అందజేశారు. ఈ సందర్భంగా సునీత బహేన్ జీ మాట్లాడుతూ రక్షబంధన్ వేడుకలు పవిత్రతా బంధానికి ప్రతీక అన్నారు. బురదలో ఉన్న చెడు అలవాట్ల నుంచి తనను తాను రక్షింకోవటం, ఇతరులను రక్షించడం అనే ప్రతిజ్ఞ ఈ రాఖీ పండగ సారాంశమన్నారు. అన్న తమ్ముడు అక్క, చెల్లెలను రక్షించాలనేటటువంటి నానుడి మనదేశంలో ఎన్నో సంవత్సరాల నుంచి వస్తుంది. కాబట్టి అన్న తమ్ముడు అక్కకు చెల్లికి మాత్రమే రక్షణ కాకుండా దేశంలో ఉన్న ప్రతి మహిళా మూర్తులను రక్షిస్తూ వసుదేవ కుటుంబకంగా వారిని వికారి దృష్టితో చూడకుండా, ఒక ప్రేమ దృష్టితో చూస్తూ ముందుకు వెళ్తే ఈ భారతదేశం సుసంపన్నంగా స్వర్గంగా తయారు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జీవీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ లో ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై వార్డు సభ



బోధన్ ప్రతినిధి,ఆగష్టు 27: (ప్రజా గళం) ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్-స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో భాగంగా గురువారం బోధన్ పట్టణంలో 35,36వ వార్డుల్లో వార్డు సభలు నిర్వహించారు.షర్బత్ కెనాల్ ప్రాంతంలోని పాషాభాయ్ ఇంటి వద్ద జరిగిన ఈ సమావేశంలో ఓటరు జాబితా సవరణ,కొత్త ఓటర్ల నమోదు,ఓటర్ల వివరాల పరిశీలన తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పద్మ శరత్ రెడ్డి,కౌన్సిలర్ సభా బేగం జావిద్,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి,అర్షద్ పాషా,కౌన్సిలర్ మహమ్మద్ జహీర్,డబ్బు,కో-ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్‌తో పాటు పలువురు ఓటర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని,ఏవైనా తప్పులు ఉంటే సవరణకు దరఖాస్తు చేసుకోవాలని,అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ఓటరు జాబితా ఖచ్చితత్వం కోసం ప్రభుత్వం చేపడు తున్న ప్రత్యేక సవరణ కార్యక్రమానికి ప్రజలు సహక రించాలని నాయకులు కోరారు.

# ఆర్మూర్‌లో ఘనంగా తీజ్ ఉత్సవాలు


-బంజారా సంప్రదాయ నృత్యాలతో సందడిగా తీజ్ వేడుకలు

-ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ గోనె లహరి రఘు

ఆర్మూర్ పట్టణంలో బంజారా సోదరుల ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ గోనె లహరి రఘు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోధుమ మొలకల బుట్టలను తలపై పెట్టుకొని బంజారా సోదరులతో కలిసి ఆమె సంప్రదాయ గిరిజన నృత్యాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గోనె లహరి రఘు మాట్లాడుతూ.. బంజారా సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ తీజ్ అని అన్నారు. వెదురు బుట్టల్లో గోధుమలు లేదా ఇతర ధాన్యాలను విత్తనాలుగా వేసి, ప్రతిరోజూ నీరు పోసి మొలకలు వచ్చిన అనంతరం బుట్టలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించడం తీజ్ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. మహిళలు, యువతులు సంప్రదాయ బంజారా వస్త్రధారణలో గిరిజన నృత్యాలు చేస్తూ, భక్తి పాటలతో ఉత్సవాలను ఆనందంగా జరుపుకుంటారని పేర్కొన్నారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ఇలాంటి పండుగలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో బంజారా సోదరులు, మహిళలు, యువతులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలి.

## కలెక్టర్ భవేష్ మిశ్రా హితవు. - ఓటర్లకు నోటీసులు అందజేస్తున్న విధానం పరిశీలన



నిజామాబాద్, ఆగస్టు 27 (ప్రజాగళం ప్రతినిధి) అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ జరగని వారికి, పేరు, వయసు వంటి అంశాలలో వ్యత్యాసం కలిగి ఉన్న ఓటర్లకు హియరింగ్ కు రావాలని కోరుతూ బీ.ఎల్.ఓలు ఇంటింటికి తిరుగుతూ నోటీసులు జారీ చేస్తున్న నేపథ్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం ఈ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిజామాబాద్ నగరంలోని 19వ డివిజన్ పరిధిలో గల కంఠేశ్వర్ లో సిబ్బంది ఇంటింటికి తిరిగి నోటీసులు అందిస్తున్న విధానాన్ని నిశితంగా పరిశీలన జరిపారు. ఎంతో ప్రాధాన్యతతో కూడిన ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. బీ.ఎల్.ఓ, సూపర్వైజర్లు అందుబాటులో ఉన్నారా లేదా అన్నది గమనించారు. వారు విధులు నిర్వర్తిస్తున్న తీరును పరిశీలించి, ఇప్పటివరకు ఎంతమందికి నోటీసులు అందించారు, ఇంకా ఎంత మందికి ఇవ్వాల్సి ఉన్నది, పోలింగ్ కేంద్రం పరిధిలో మ్యాపింగ్ జరగని ఓటర్లు ఎంతమంది ఉన్నారు తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధృవీకరణ అవసరం ఉన్న ఓటర్ల ఇంటింటి స్వయంగా వెళ్లి నోటీసులు అందించాలని, సూచించిన సమయానికి ఒకవేళ వారు రాలేకపోతే మరోమారు నోటీసు ఇవ్వాలని సూచించారు. నోటీసు అందించే సమయంలోనే ఎవరైనా ఓటర్లు ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే వాటిని స్వీకరించవచ్చని అన్నారు. నిర్ణీత గడువులోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బీ.ఎల్.ఓ సూపరింటెండెంట్ మురళి, బీ.ఎల్.ఓ లావణ్య ఉన్నారు.

# అక్టోబర్ 10 వ తేదీన వచ్చే శనివారం అమావాస్య సం దర్భంగా.

## పూజ సామాగ్రి విక్రయ దుకాణా సముదాయాల నిర్వహణకు వేలంపాట.



ఎడపల్లి,ఆగష్టు 27: (ప్రజా గళం) ఎడపల్లి మండలం జానకంపేట శ్రీ లక్ష్మీనరసింహ స్వా మి ఆలయంలో లడ్డు పులిహోర,కొబ్బరి కాయ,నవధా న్యాలు అమ్ముకొనుటకు,సైకిల్ స్టాండ్ ఏర్పాటుకు గురు వారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో,దేవాదాయ ధర్మా య శాఖ అధికారులు వేలం పాట నిర్వహించారు. వచ్చే అక్టోబర్ 10 వ తేదీన శనివారం అమావాస్య వస్తున్నందున, భక్తుల కోసం,పూజ సామాగ్రి,లడ్డు పులిహోర, కొబ్బరికాయ నవధాన్యాలు, సైకిల్ స్టాండ్ కు వేలం పాట నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వా హణాధికారి గింజుపల్లి వేణు తెలిపారు.లడ్డు,పులి హోర విక్రయించుకునేందుకు నిజామాబాద్ కు చెందిన జి.సురేష్ అనే వ్యాపారి వేలం పాటలో పాల్గొని 47 వేల రూపాయలకు దక్కించుకున్నారని,అలాగే కొబ్బరికాయ,నవధాన్యాలు విక్రయించుకునేందుకు జాన్కంపేట్ గ్రామానికి చెందిన ఏ.సిద్దు అనే వ్యాపారి వేలంపాట పాల్గొని 55 వేల రూపాయలకు దక్కించుచకోగా,సైకిల్ స్టాండ్ ఏర్పాటుకు జాన్కంపేట్ కు చెందిన సుమన్ 10 వేల రూపాయలకు వేలం పాటలో దక్కించుకున్నారని ఈవో వేణు తెలిపారు.వచ్చే శనివారం అమావాస్య రోజున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పవిత్ర అష్ట ముఖి కోనేటిలో స్నానమాచరించి శ్రీ లక్ష్మినరసింహా స్వామి వారిని దర్శించుకుని స్వామి వారి కృపాకు పాత్రులు కావాలని భక్తులను అయన కోరారు. ఆలయ చైర్మన్ చిలుక రవికుమార్ మాట్లాడుతూ..వచ్చే అక్టోబ ర్ 10 న వచ్చే శనివారం అమావాస్య సందర్బంగా ఈ రోజున పూజ సామాగ్రి విక్రయానికి వేలం పాట నిర్వ హించడం జరిగింది అని తెలిపారు.శనివారం అమావా స్య కోసం భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ తరపున, దేవాదాయ ధర్మదాయ శాఖ తరపున అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరుగుతుంది అని అన్నారు.ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో దక్షిణ భారత దేశంలోనే రెండవ పవిత్ర అష్టముఖి (పుష్కరిణి)కొనేరు వెలసియుందని,ఈ కోనేరులో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటే కోరిన వారికి కొంగు బంగారమై, అష్టఐశ్వర్యలు సిద్ధిస్తాయని భక్తులు విశ్వసిస్తారని అన్నారు.ఈ సందర్బంగా అమావాస్య శనివారం రోజున భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని స్వామి కృపాకు పాత్రులు కావా లని చైర్మన్ చిలుక రవికుమార్ కోరారు.ఈ కార్యక్రమం లో జిల్లా ఎండోమెంట్ ఇన్స్ స్పెక్టర్ సుజాత రెడ్డి, ఆలయ డైరెక్టర్లు,జింక లక్ష్మి లింగం,గ్రామ పెద్దలు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందేలా కృషి చేయాలి.

సాంఘిక బహిష్కరణ ఘటనలపై కఠినంగా వ్యవహరించాలి.

విజిలెన్సు, మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్.



నిజామాబాద్, ఆగష్టు 27 ( ప్రజా గళం ప్రతినిధి ): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అట్రాసిటీ కేసుల పురోగతి పై నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ డివిజన్ ల వారీగా కలెక్టర్ సమీక్షించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు వీలుగా పకడ్బందీగా దర్యాప్తు జరిపి పూర్తి ఆధారాలను సేకరించి సకాలంలో చార్జ్ షీట్ ఫైల్ చేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు.

అట్రాసిటీస్ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం, ఇతర సహాయ సహకారాల విషయంలో ఎలాంటి జాప్యం జరుగకుండా చూడాలన్నారు. కేసుల సత్వర పరిష్కారం కోసం రెవెన్యూ, తదితర శాఖల కార్యాలయాల ద్వారా ఎప్పటికప్పుడు అవసరమైన నివేదికలను, లేఖలను అందజేయాలని సూచించారు. కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా చూడాలని సూచించారు.

ప్రతి నెల సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని, దళిత, గిరిజన వర్గాల ప్రజల హక్కులపై వారికి అవగాహన కల్పించడంతో పాటు, వారి సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు జీవనాధారం కోసం ప్రభుత్వం అందజేసిన అసైన్డ్ భూములను ఎవరైనా కబ్జా చేసినట్లైతే తమ దృష్టికి తేవాలని, బాధితులకు భూభారతి చట్టం ద్వారా న్యాయం జరిగేలా కృషి చేస్తామని కలెక్టర్ సూచించారు. కాగా, గ్రామాలలో సాంఘిక బహిష్కరణలు వంటి సంఘటనలు జరిగినప్పుడు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను తప్పకుండా అమలయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, జిల్లా రెవెన్యూ అధికారిణి గీత, జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారిణి రజిత, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఏసీపీలు ప్రకాష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు, విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
28 -08-2026

# డిమాండ్ల సాధన కోసం ఉద్యమించిన ఉద్యోగులు

## -ధర్నా చౌక్ లో మహాధర్నా -భారీగా తరలివచ్చిన ఉద్యోగులు




నిజామాబాద్, ఆగస్టు 27( ప్రజాగళం ప్రతినిధి ) గత కొంతకాలంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు ఉద్యమం చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ లో మహాధర్నా కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ మహాధర్నా కు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యోగులు తరలివచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ జేఏసీ చైర్మన్ నాశెట్టి సుమన్ ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. తమ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన స్పందించడం లేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లో ఉద్యోగుల పాత్ర కీలకమని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకై పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగులకు అడుగడుగున అన్యాయం జరుగుతుందని నాశెట్టి సుమన్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల పట్ల గత ప్రభుత్వ విధానాలను, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తుందని దీంతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈ హెచ్ ఎస్) అమలులో అధికారుల అలసత్వం, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయాలు తీసుకోని 2వ పే రివిజన్ కమిటీ నివేదిక అమలు, 6 పెండింగ్ డీఏల విడుదల, సీపీఎస్ రద్దు చేసి ఒపీఎస్ అమలు, ఈహెచ్ఎస్ ను పటిష్టంగా అమలు చేయాలని టీజీఈ-జేఏసీ డిమాండ్ చేస్తుందాన్నారు. నిజామాబాద్ జిల్లా ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన మహాధర్నా లో తెలంగాణ ఎంప్లాయీస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్ అండ్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ లు పాల్గొన్నయన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మూడు హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని ప్రధానంగా క్రింది మూడు కీలక అంశాల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు, ఆరోగ్య కార్డుల వినియోగం, చికిత్స అందుబాటు, ఎంపానెల్ చేసిన ఆసుపత్రుల్లో సేవలు, వైద్య బిల్లుల పరిష్కారం తదితర అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గత మూడు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు పెన్షనర్స్ వర్కర్స్ తదితరులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 2వ పే రివిజన్ కమిటీ (రెండవ పి ఆర్ సి) నివేదికను ప్రభుత్వం వెంటనే ప్రకటించి, ఎలాంటి జాప్యం లేకుండా అమలు చేయాలన్నారు. జూన్ 2 లోపు పి ఆర్ సి నివేదికను కమిటీ నుండి తెప్పించుకొంటామనే ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు.

అదేవిధంగా ఉద్యోగులకు రావాల్సిన ఆరు (6) వాయి దాల పెండింగ్ డీఏలను (డీర్నెస్ అలవెన్సుస్ ) వెంటనే మంజూరు చేసి, ఒకేసారి విడుదల చేసి చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు..గత పిఆర్సీ గడువు ముగిసి మూడు సంవత్సరాలు పూర్తి అయినందున 2 పి ఆర్ సి నివేదికను తక్షణమే అమలు చేయడంతో పాటు, 6 పెండింగ్ డీఏలను కూడా ఎటువంటి అలస్యం లేకుండా విడుదల చేయాలని ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని జిల్లా ఉద్యోగ జేఏసీ కోరుతోందన్నారు. ఉద్యోగుల పదవీ విరమణ అనంతర జీవితానికి ఆర్థిక భద్రత కల్పించే విషయంలో పెన్షన్ విధానం అత్యంత కీలకమైన జిల్లా ఉద్యోగ జేఏసీ పేర్కొంది. ప్రస్తుతం అమల్లో ఉన్న కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్ )ను రద్దు చేసి, ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్ (ఒ పి ఎస్ )ను పునరుద్ధరించాలన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. డిమాండ్ల నిమిత్తం ప్రభుత్వం ముందుకు వచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని కోరుతోందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలను అధికారులు అమలు పరచక పోవడాన్ని టీజీఈ జేఏసీ నిజామాబాద్ జిల్లా పక్షాన తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. 2వ పి ఆర్ సి నివేదికను వెంటనే ప్రకటించి అమలు చేయాలన్నారు. ఉద్యోగుల పెండింగ్ బిల్స్ కొరకు ప్రభుత్వం చెల్లిస్తున్న 2000 కోట్లు యదావిధిగా ఈ నెల నుండి కొనసాగించాలన్నారు. 'విద్యాశాఖ రేషనలైజేషన్ జి .ఒ 25 ను సవరించాలన్నారు. విద్యా శాఖ ఏకీకృత సర్వీసు నిబంధనలు రూపొందించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలన్నారు. 317 జి .ఒ బాధితులకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫేస్టో లో పెట్టిన విధంగా, అంగన్వాడీ ఉద్యోగుల జీత భత్యలు పెంచాలన్నారు. తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో టీ జి ఈ -జేఏసీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ రోజు నుంచి పీఆర్సీ నివేదిక విడుదలయ్యే వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు అవుతామని ప్రభుత్వానికి హెచ్చరించారు. టీజీఈజేఏసీ జిల్లా కమిటి యూనిట్, మండలాలు పర్యటన సన్నహక సదస్సులు. సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం సందర్భముగా ఐ డి ఒ సి కార్యలయ ఆవరణలో నిరసన తెలుపుతామన్నారు. సెప్టెంబర్ 10న హైదరాబాద్ లో మహా ధర్నా చెపడతామన్నారు. ఈ మహా ధర్నాలో ఉద్యోగ సంఘాల నాయకులు ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాను విజయవంతం చేశారు.

# గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన తీజ్ పండుగ.

## వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి.





నిజామాబాద్ ఆగస్టు 27 (ప్రజాగళశీ ప్రతినిధి ): కమ్మర్‌పల్లి మండలం కేసీ తండా గ్రామపంచాయతీ, వాసన్‌గట్టు తండాలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆయా తండాలలో జగదాంబ మాయి, సేవాలాల్ మహారాజ్‌లను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం గిరిజన సోదర, సోదరీమణులతో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొని వారిని ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. తీజ్ పండుగ గిరిజన, బంజారా సమాజానికి ఎంతో ప్రత్యేకమైన పండుగ అని అన్నారు. గిరిజన సమాజం ఐక్యత, సంప్రదాయాలు, సంస్కృతికి తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. గిరిజనుల సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలను తరతరాలకు కొనసాగిస్తూ భావితరాలకు అందించడం అభినందనీయమన్నారు. బంజారా సంస్కృతిలో ప్రత్యేక స్థానం కలిగిన సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అకాక్షించారు. ఈ సందర్భంగా గిరిజన సోదర సోదరీమణులందరికీ తీజ్ పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గిరిజన పెద్దలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పలు వివాహాది శుభ కార్యక్రమాల్లో ఈరవత్రి రాజశేఖర్

ఆగస్టు 27 నిజామాబాద్ నగరంలో గురువారం నిర్వహించిన పలు వివాహాది శుభ కార్యక్రమాల్లో జు= ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమాల్లో ఆయన వెంట ER ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ సురేష్, నూకల శేఖర్, కేవీ రమణ, వినోద్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐసిఐసిఐ బ్యాంకు సందర్శనతో పాటు తీజ్ వేడుకల్లో ఈరవత్రి రాజశేఖర్

ఆగస్టు 27 ఆర్మూర్ పట్టణంలో గురువారం జరిగిన పలు కార్యక్రమాల్లో ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్, జు= ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ పాల్గొన్నారు. తొలుత పట్టణంలోని ఐసిఐసిఐ బ్యాంకును సందర్శించిన ఆయనకు బ్యాంకు మేనేజర్, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌ను ఈరవత్రి రాజశేఖర్ సన్మానించారు.

# జిల్లా ప్రజలకు రక్షా బంధన్ శుభాకాంక్షలు.

## సోదర భావానికి ప్రతీక గా నిలిచిన పండగ.

## ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా.






నిజామాబాద్, ఆగస్టు 27 ( ప్రజాగళం ప్రతినిధి): సోదర భావానికి ప్రతీక అయిన రక్షా బంధన్ (రాఖీ పండుగ) పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ రాఖీ పండగను సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. తమ సోదరీమణులకు ఏ ఆపద రాకుండా ఎల్లవేళలా అండగా నిలబడతామని సోదరులు భరోసాను అందించడం ఈ పండుగ విశిష్టత అని గుర్తు చేశారు. "రాఖీ" కుటుంబ బంధాలను బలోపేతం చేసే వారధి అని అన్నారు. మహిళలకు భద్రత, గౌరవం ఎంతో ముఖ్యమనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుందని, కులమతాలకు అతీతంగా మానవత్వాన్ని, ప్రేమానురాగాలను చాటే ఈ పర్వదినం మన సంస్కృతి, ఔన్నత్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. సోదరభావంతో, ప్రేమానురాగాలతో ప్రతి సంవత్సరం శ్రావణమాసం పౌర్ణమి నాడు రాఖీలు కట్టుకుంటూ జరుపుకునే ఈ వేడుక భారతీయ సాంప్రదాయాల గొప్పదనాన్ని యావత్ ప్రపంచానికి చాటుతుందన్నారు. రాఖీ పౌర్ణమి వేడుక ప్రజల మధ్య ఆత్మీయతను మరింతగా పెంపొందించాలని వారు ఆకాంక్షించారు.

# అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలి.

## కలెక్టర్ భవేష్ మిశ్రా హితవు.

## ఓటర్లకు నోటీసులు అందజేస్తున్న విధానం పరిశీలన



నిజామాబాద్, ఆగస్టు 27 (ప్రజాగళం ప్రతినిధి) : అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ జరగని వారికి, పేరు, వయసు వంటి అంశాలలో వ్యత్యాసం కలిగి ఉన్న ఓటర్లకు హియరింగ్ కు రావాలని కోరుతూ బీ.ఎల్.ఓలు ఇంటింటికి తిరుగుతూ నోటీసులు జారీ చేస్తున్న నేపథ్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం ఈ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిజామాబాద్ నగరంలోని 19వ డివిజన్ పరిధిలో గల కంఠేశ్వర్ లో సిబ్బంది ఇంటింటికి తిరిగి నోటీసులు అందిస్తున్న విధానాన్ని నిశితంగా పరిశీలన జరిపారు. ఎంతో ప్రాధాన్యతతో కూడిన ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. బీ.ఎల్.ఓ, సూపర్వైజర్లు అందుబాటులో ఉన్నారా లేదా అన్నది గమనించారు. వారు విధులు నిర్వర్తిస్తున్న తీరును పరిశీలించి, ఇప్పటివరకు ఎంతమందికి నోటీసులు అందించారు, ఇంకా ఎంత మందికి ఇవ్వాల్సి ఉన్నది, పోలింగ్ కేంద్రం పరిధిలో మ్యాపింగ్ జరగని ఓటర్లు ఎంతమంది ఉన్నారు తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధృవీకరణ అవసరం ఉన్న ఓటర్ల ఇంటింటి స్వయంగా వెళ్లి నోటీసులు అందించాలని, సూచించిన సమయానికి ఒకవేళ వారు రాలేకపోతే మరోమారు నోటీసు ఇవ్వాలని సూచించారు. నోటీసు అందించే సమయంలోనే ఎవరైనా ఓటర్లు ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే వాటిని స్వీకరించవచ్చని అన్నారు. నిర్ణీత గడువులోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బీ.ఎల్.ఓ సూపరింటెండెంట్ మురళి, బీ.ఎల్.ఓ లావణ్య తదితరులు ఉన్నారు.

## పోలీస్ కమిషనర్ సాయి చైతన్యకుకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



నిజామాబాద్ క్రైమ్ ఆగస్టు 27(ప్రజా గళం): రాఖీ పండుగను పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారీస్, ఈశ్వరీయ విశ్వవిద్యాల యానికి చెందిన బ్రహ్మకుమారీలు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ని గురు వారం మర్యాదపూర్వకంగా కలిసి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు పోలీస్ కమి షనర్ సాయి చైతన్యకు రాఖీ కట్టి , రక్షాబంధన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో శాంతి , భద్రత, సోదరభావం , మానవతా విలువలను పెంపొందించడంలో పోలీస్ శాఖ చేస్తున్న సేవలను వారు అభినందించారు. రాఖీ పండుగ సోదర - సోదరీమణుల మధ్య ప్రేమ , ఆప్యాయత, పరస్పర రక్షణకు ప్రతీక అని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు సోదరభావంతో , శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు పోలీస్ కమిషనర్ కు రాఖీ కట్టి , ఆశీస్సులు అందించారు. సీపీ కి రాఖీ కట్టిన వారిలో బ్రహ్మ కుమారి లు వనజ , శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com